370) నాదరామక్రియ / కల్యాణి

ప॥ ఇదివో నీప్రతాపము యెక్కడ చూచినా దానే । యెదిటిబ్రహ్మాండము యిమ్ముచాల దిందుకు ॥

చ॥ పనిగొంటే భువిలో నేబదియే అక్షరములు । కొనాడితే నీగుణాలు కోటానగోటి ।
యెనసి పదునాలుగే యెడమైన లోకములు । అనిశము నీవియైతే ననంతమహిమలు ॥

చ॥ మించి నిండుకొంటే నెనిమిదే దిక్కులు । అంచల నీకతలైతే ననేకములు ।
యెంచి చూచితే గలవి పంచభూతాలే । ముంచిననీమాయ తుదమొదలే లేదు ॥

చ॥ వుపమించి తెలిపితే నొక్కటే జగము । అపురూపు నీసృష్టి అతిఘనము ।
అపరిమితపుజీవు లణుమాత్రలై నాను । యెపుడు శ్రీవేంకటేశ యెక్కుడు నీదాసులు ॥